క్లుప్తంగా

సచివాలయ సందర్శన



పొదలకూరు : గ్రామసచివాలయం నిర్వహణ, పాలనపై అవగాహన పెంచుకునేందుకు ట్రెయినీ డిప్యూటీకలెక్టర్ మహేష్ అల్కతుర్ దేగపూడి సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి సచివాలయ రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరును ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ ఓబుల్‌రెడ్డి ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



విడవలూరు(కోవూరు): రైతులు యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని ఏఓ వెంకటకృష్ణయ్య సూచించారు. విడవలూరుకు చెందిన రైతు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి పొలంలోని కేఎన్ఎం1638 రకం నారుమడిని శుక్రవారం ఆయన పరిశీలించారు. వరిలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగుల నివారణకు నాట్లు వేసే సమయానికి వారం రోజుల ముందుగా సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బొఫ్యూరాన్ 34 గుళికలను వాడాలని సూచించారు. ఎండలకు నారు దెబ్బతినకుండా వీలైనన్ని ఎక్కువసార్లు నీరు పెడుతూ తీస్తూ ఉండాలన్నారు.

సర్వేపల్లి సభ విజయవంతానికి పిలుపు



పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ నెల 28తో విజయవంతంగా ముగియనుంది. ఈ సందర్భంగా వెంకటాచలం మండలం సర్వేపల్లిలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి నిర్వహించనున్న ముగింపు సభను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. పొదలకూరులోని ఎంపీపీ ఛాంబర్‌లో ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లిలో సాయంత్రం 4 గంటలకు జరిగే ముగింపు సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. పోలేరమ్మ ఆలయ చైర్మన్ ఎం శేఖర్‌బాబు, వార్డు సభ్యులు ఎస్‌కే అంజాద్, వాసుదేవరావు, హరి, నాయకులు డీ విజయభాస్కర్‌రెడ్డి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు



నెల్లూరు (టౌన్): యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని ఎస్ఈబీ సీఐ కిషోర్ పేర్కొన్నారు. దిశ చట్టం, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలపై అవగాహన సదస్సును వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు సేవించినా.. కలిగి ఉన్నా జైలు శిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. మెడికల్ అధికారి భాస్కర్‌రావు, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



నెల్లూరు(బారకాసు): పర్యావరణాన్ని పరిరక్షించి.. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కాంక్షించారు. పర్యావరణహిత జీవన శైలిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ నగరంలో సైకిల్ ర్యాలీని నగరపాలక సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రామ, వార్డు సచివాలయ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో సైకిల్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణతో పాటు జౌళి సంచులను వాడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ ర్యాలీలు, నడక పోటీలు, మారథాన్, తదితర కార్యక్రమాలను క్రమం తప్పకుండా అమలు చేయనున్నామని చెప్పారు. అనంతరం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు ర్యాలీ సాగింది.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పాలన



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. తొలుత స్థానికులు మంత్రికి ఘనత స్వాగతం పలికారు. యువత గజమాలతో మంత్రిని సత్కరించారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. గతంలో హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు రాష్ట్ర ప్రజలను అన్ని విధాలా మోసం చేయగా, సీఎం వైఎస్ జగన్ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పెత్తనంతో అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదని గుర్తుచేశారు. ఎన్నికలకు మూడు నెలలు ముందుగా చంద్రబాబు రూ.1000 పెన్షన్‌ను రూ.2వేలకు పెంచి ఓట్లు వేయించుకోవాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు.

దమ్మున్న సీఎం వైఎస్ జగన్

రాష్ట్రంలో ఎంతో మంది సీఎంలుగా పరిపాలన చేసినా దమ్మున్న సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. చంద్రబాబు పాలనకు, తన పాలనకు బేరీజు వేసుకుని, తాను చంద్రబాబు కంటే మిన్నగా పరిపాలన చేశానని నమ్మితేనే ఓట్లు వేయండని ప్రజలను కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో చంద్రబాబు ఎన్నికుట్రలు చేసినా వాటిని అధిగమించి సీఎం వైఎస్ జగన్ పట్టాలు అందజేశారని వివరించారు. గతంలో ఎవ్వరూ అమలు చేయని విధంగా అమ్మఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, వసతిదీవెన , తదితర పథకాలు అమలు చేస్తుండడంతో సీఎం వైఎస్ జగన్ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీపీఓ సుస్మిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



మందులు పంపిణీ చేస్తున్న గణేష్‌శర్మ

ముత్తుకూరు: ఆదాని కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లోని పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఆదాని ఫౌండేషన్ పనిచేస్తోందని ఆ పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, అపోలో ఆస్పత్రుల సహకారంతో ముత్తుకూరు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఆదాని చికిత్సాలయంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గణేష్‌శర్మ ప్రారంభించారు. సాధారణ వైద్యపరీక్షలతో పాటు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 300 మందికి వైద్యసేవలు అందించారు. స్థానిక వైద్యాధికారి అనూష, వెంకటాచలం ప్రభుత్వ కంటి వైద్య నిపుణులు బాలపద్మ, ఫౌండేషన్ డాక్టర్ సుహార్సన్, అపోలో డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

రూ.55.56 కోట్ల రుణాలు మంజూరు



బ్యాంకు రికార్డులను పరిశీలిస్తున్న డీసీఓ సుధాభారతి

బుచ్చిరెడ్డిపాళెం: ది బుచ్చిరెడ్డిపాళెం కోఆపరేటివ్ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ బ్యాంకు ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.55.56 కోట్ల రుణాలను రైతులకు మంజూరు చేసినట్లు డీసీఓ సుధాభారతి తెలిపారు. శుక్రవారం బ్యాంకును ఆమె సందర్శించారు. రుణాలు, నగదు డిపాజిట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకులో రైతులకు సకాలంలో రుణాలను అందజేస్తున్నట్లు గుర్తించామన్నారు. రికార్డులను పరిశీలించి పక్కాగా ఉన్నట్లు గుర్తించామన్నారు. బ్యాంకు సీఈఓ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ గతంతో బ్యాంకు ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన కమిషన్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆమె నగర పంచాయతీ పరిధిలోని ఐదో వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట సబ్‌డివిజన్ కోఆర్డినేటర్ ఎంవీ సుభాషిణి ఉన్నారు.

వలంటీర్లకు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్ల వితరణ



గండవరం వలంటీర్‌కు ట్రైసైకిల్ అందజేస్తున్న చలపతిరావు

కొడవలూరు: మండలంలోని రేగడిచెలిక, గండవరానికి చెందిన దివ్యాంగ వలంటీర్లు కీర్తి, అంజమ్మకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం ట్రైసైకిళ్లను వితరణ చేశారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథిగృహ ప్రాంగణంలో గురువారం వలంటీర్లకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన వలంటీర్లు కీర్తి, అంజమ్మ తమకు ట్రైసైకిళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రసన్న ఎన్ఎస్సార్ ట్రస్ట్ ద్వారా ట్రైసైకిళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు రెండు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లను శుక్రవారం నార్తురాజుపాళేనికి పంపి డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు చేతుల మీదుగా అందజేశారు. దీంతో ఎమ్మెల్యేకు వంటీర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహన్‌కృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, నల్లావుల శ్రీనివాసులు, దేవనబోయిన శివకుమార్, అక్కుల్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



తలపడుతున్న మనుబోలు-కట్టువపల్లి జట్లు

మనుబోలు: మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి దివంగత కాకాణి రమణారెడ్డి జ్ఞాపకార్థంగా కుడితిపల్లిలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లలో మనుబోలు, కొమ్మలపూడి జట్లు విజయం సాధించాయి. తొలిమ్యాచ్‌లో మనుబోలు, కట్టువపల్లి జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన మనుబోలు జట్టు నిర్ణీత ఓవర్లలో 104 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కట్టువపల్లి జట్టు 65 పరుగులకే ఆలౌటైంది. దీంతో మనుబోలు జట్టు 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో కొమ్మలపూడి జూనియర్స్, బద్దెవోలు జట్లు తలపడ్డారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కొమ్మలపూడి జూనియర్స్ జట్టు 95 పరుగులు చేసింది. అనంతరం బద్దెవోలు జట్టు లక్ష్య సాధనలో 68 పరుగులకే ఆలౌటైంది. కొమ్మలపూడి జూనియర్స్ జట్టు 27 పరుగుల తేడాతో విజయం సాధించింది.

సమ్మర్ యాక్టివిటీస్ పరిశీలన



8వ తరగతి విద్యార్థిని నోట్స్‌ను పరిశీలిస్తున్న హిందీ పండిట్

కొడవలూరు: గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థుల సమ్మర్ యాక్టివిటీస్‌ను ఆ పాఠశాల హిందీ పండిట్ జీ నాగభూషణం శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. వేసవి సెలవుల్లోనూ విద్యార్థుల అభ్యాసన కుంటు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర విద్యాశాఖ సమ్మర్ యాక్టివిటీస్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ప్రతి తరగతికి ఒక వాట్సాప్ గ్రూపు రూపొందించి అందులో విద్యార్థులు, ఉపాధ్యాయులను చేర్చాలి. ఉపాధ్యాయులు వాట్సప్ ద్వారా పంపే విషయాలను విద్యార్థులు ప్రత్యేక నోట్ పుస్తకంలో నోట్ చేసుకోవాలి. ఈ నోట్సులను పాఠశాలలు ప్రారంభం రోజున ఉపాధ్యాయులు విధిగా పరిశీలించాలని విద్యాశాఖ ఆదేశించింది. అందులో భాగంగా హిందీ పండిట్ విద్యార్థుల నోట్స్‌ను పరిశీలించారు. వారు రూపొందించిన కృత్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట విద్యా కమిటీ చైర్‌పర్సన్ రహ్మతున్నీసా ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలకు ఆహ్వానం

పొదలకూరు : మరుపూరులో నూతనంగా పునర్నిర్మించిన కామాక్షి సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గ్రామపెద్దలు శుక్రవారం ఆహ్వానించారు. ఈ నెల 29 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. వైస్ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

ముత్తుకూరు: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు ఆంజనేయస్వామిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. దివంగత ఈదూరు పట్టాభిరామిరెడ్డి–రాజమ్మ జ్ఞాపకార్థంగా తనయులు ఈదూరు రామకృష్ణారెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, ఈదూరు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



విడవలూరు(కోవూరు): విడవలూరు మండలం ముదివర్తి పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ క్రింద 2017లో తాను నిర్మించిన సీసీరోడ్డుకు సంబంధించి మంజూరైన బిల్లును పంచాయతీ కార్యదర్శి అచ్చయ్య తనకు ఇవ్వకుండానే ఖర్చు చేసేశాడని కాంట్రాక్టర్ కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల క్రింద తాను చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి రూ.1.10 లక్షలను ఈ ఏడాది జనవరి 6న ముదివర్తి పంచాయతీ ఖాతాలో ప్రభుత్వం జమచేసిందని తెలిపారు. అయితే ఫిబ్రవరి 28న పంచాయతీ ఖాతా నుంచి నగదు డ్రా చేసిన కార్యదర్శి తనకివ్వకుండా ఇతర పంచాయతీ అవసరాలకు ఖర్చుచేశాడని చెప్పారు. ఈ విషయమై పంచాయతీకార్యదర్శిని పలుమార్లు అడిగినా సమాధానం చెప్పలేదని ఆరోపించారు. అధికారులు చొరవ చూపి తన బిల్లును తనకు ఇప్పించాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



ముత్తుకూరు: పంటపాళెం పంచాయతీలో నక్కలకాలువ సమీపంలో శుక్రవారం తెగిపడిన విద్యుత్‌తీగను తగిలి ఓ గేదె మృత్యువాత పడింది. పంటపాళెం దళితవాడకు చెందిన పాముల మస్తానమ్మ తన గేదెను మేత కోసం నక్కలకాలువ సమీపంలోకి తోలుకెళ్లింది. మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్‌తీగను గేదె తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మస్తానమ్మ త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుంది. కుటుంబ పోషణకు ఆధారమైన సుమారు రూ.70 వేల విలువైన గేదె మృతి చెందడంతో ఆమె ఆవేదన చెందారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 7,8 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై ఆరాతీశారు. సచివాలయ నిధులతో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ప్రతిపక్షాలు అవాస్తవ ఆరోపణలు చేస్తున్నాయన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 20 వార్డులోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ చొరవతో రూ.85 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. మరో రూ.110 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటికే బుచ్చిరెడ్డిపాళెంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. త్వరలోనే బుచ్చిరెడ్డిపాళెం రూపురేఖలు మార్చి జిల్లాలోనే ఆదర్శ నగర పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 73,236 గృహాలను సందర్శించామన్నారు.

ఓటీఎస్ పత్రాల అందజేత

20వ వార్డు పరిధిలోని రామచంద్రాపురానికి చెందిన 40 మంది ఓటీఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, వారికి ఓటీఎస్ పత్రాలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అందజేశారు.

దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ ట్రైసైకిల్ వితరణ

పెనుబల్లికి చెందిన దివ్యాంగుడు మావిళ్ల శ్రీనివాసులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ట్రైసైకిల్‌ను వితరణ చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలో నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి ట్రస్టు ద్వారా రూ.35 వేల విలువైన ఎలక్ట్రిక్ ట్రైసైకిల్‌ను అందజేశారు. ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్లు లలిత, షాహుల్, కౌన్సిలర్లు షకీలాబేగం, నస్రీన్, రహమత్, యానాదిరెడ్డి, ప్రసాద్, మల్లారెడ్డి, జయంతి, శ్రీదేవి, శివకుమార్ రెడ్డి, అనంతమ్మ, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మోర్ల మురళి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, అల్లాబక్షు, డాక్టర్ అల్లాబక్షు, చిన్నఅల్లాబక్షు, నరసింహారావు, మధుసూదన్‌రెడ్డి, రమేష్, చాందిని, ప్రవల్లిక, పెంచలయ్య పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

మనుబోలు: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఈఓ చిరంజీవి సచివాలయ సిబ్బందికి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాగితాలపూరు, మనుబోలు సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అందించే సేవల వివరాలను బోర్డుల ద్వారా ప్రదర్శించాలన్నారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరాతీశారు. సమయాన్ని పాటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైభవంగా చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విశేషాలంకారంలో చాముండేశ్వరిదేవి



ఆకట్టుకుంటున్న అమ్మవారి విద్యుద్దీపాలంకరణ

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అంకురార్పణ పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేశారు. శనివారం ఉదయం, రాత్రి చప్పరోత్సవం, 28న ఉదయం చప్పరోత్సవం, రాత్రి గజ వాహనోత్సవం, 29న ఉదయం చప్పరోత్సవం, రాత్రి సింహ వాహనోత్సం నిర్వహించనున్నారు. 30న ఉదయం చప్పరోత్సవం, రాత్రి పులి వాహనోత్సవం, 31న ఉదయం చప్పరోత్సవం, రాత్రి అశ్వ వాహనోత్సవం, జూన్ 1న ఉదయం చప్పరోత్సవం, రాత్రి పులి వాహనోత్సవం, 2న సింహ వాహనోత్సవం నిర్వహించనున్నారు. 3న కల్యాణోత్సవం, 4న వసంతోత్సవం, త్రిశూలేశ్వరస్వామి ఉత్సవం, గంగోత్సవం, 5న ఉదయం తీర్థవాది, రాత్రి రథోత్సవం(సిరిమాను) కనుల పండువగా నిర్వహించనున్నారు. 6న సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని కొలనులో తెప్పోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించనున్నారు.

దారి సౌకర్యం కల్పనపై రైతుల హర్షం



పులిమిట్ట పొలాల్లోకి నిర్మించిన రోడ్డు

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరులో పొలాల్లోకి సరైన దారి లేక రైతులు మూడు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరిష్కరించారు. ఆక్రమణలను తొలగించి పొలాల్లోకి దారి సౌకర్యం కల్పించారు. దీంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. లేబూరు నుంచి పులిమిట్ట పొలాల్లోకి వెళ్లేందుకు సరైన దారి సౌకర్యం లేక మూడు దశాబ్దాలుగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. లేబూరుతో పాటు పున్నూరుకు చెందిన సుమారు 50 మంది చిన్న,సన్నకారు రైతులు ఇక్కడ పంటలను సాగు చేస్తున్నారు. సాగు సమయంలో దుక్కిదున్నేందుకు, పంటలకు ఎరువులు తీసుకెళ్లేందుకు, పండించిన పంటలను ఇంటికి తరలించేందుకు ట్రాక్టర్లు వెళ్లేందుకు సరైన దారి సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి రైతులు దారి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే యుద్ధప్రాతిపదికన దారి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆక్రమణలను తొలగించిన రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లు, బండ్లు వెళ్లేందుకు మార్గాన్ని సుగమం చేశారు. సుమారు కిలోమీటరు దూరం ఉన్న ఈ రహదారికి రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో గ్రావెల్ రోడ్డు వేయించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ప్రసన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

29న తెలుగు భాషోద్యమ సమాఖ్య మహాసభ

నెల్లూరు(బృందావనం): తెలుగు భాషోద్యమ సమాఖ్య మహాసభను పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో సోమవారం నిర్వహించనున్నామని రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ శుక్రవారం తెలిపారు. తెలుగు భాషాభిమానులు, రచయితలు, కవులు, సాహితీవేత్తలు హాజరుకావాలని కోరారు.